క్లుప్తంగా

రజకుల సమస్యల పరిష్కారనికి కృషి



గోవిందును సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

పాములపాడు: రజకుల సమస్యలను రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రజక సంఘం ఐక్యవేదిక జిల్లా సలహాదారు రాజయపాటి గోవిందు అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక రజక సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఐక్యవేదిక జిల్లా గౌరవ సలహాదారుగా ఎన్నుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రజకులు విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి పిల్లలను బాగా చదివించాలన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు.

మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ జఫ్రుల్లా

జూపాడుబంగ్లా: మద్యం, నాటుసారా తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా అన్నారు. శనివారం మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయంలో నవోదయం2.0 కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేయటం, విక్రయించడం చట్టరీత్యానేరమన్నారు. నాటుసారా, మద్యం తాగటం వల్ల డబ్బులు వెచ్చించి ఆరోగ్యం పాడుచేసుకున్నవారవుతారని తెలిపారు. దురలవాట్లను వీడి కుటుంబాలతోఆనందంగా ఉండాలని కోరారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పాములపాడు: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ పరీక్ష జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 102 మందికి గాను 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, చేతులు కలుపుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.

దేవీభాగవతంపై ప్రవచనాలు



ప్రవచనం వినిపిస్తున్న కళాకారిణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్ కి చెందిన డి.ఎల్. కామేశ్వరి దేవీభాగవతంపై ప్రవచనాలు వినిపించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రవచన కార్యక్రమం చేపట్టారు.

పకడ్బందీగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్ష

నంద్యాల(అర్బన్): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల(స్క్రీనింగ్ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ రామునాయక్ అధికారులను ఆదేశించారు. నేటి ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే ఈ పరీక్ష నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యం వద్ద గల రాజీవ్ గాంధీ మెమోరియల్ కళాశాల, నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాల్ ఎదురుగా రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు 9 గంటల్లోపు కేంద్రంలోకి వెళ్లాలని, ఆ తర్వాత అనుమతించమని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జమ్మలమడుగు క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుల శ్రీను (40) అనే వ్యక్తి మృతి చెందాడు. బాచ్చాపురం గ్రామానికి చెందిన ఇతను చిన్నకందుకూరులో బంధువు మృతి చెందడంతో వెళ్లి మోటార్ సైకిల్‌పై తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. పట్టణ సమీపంలో బైపాస్ రోడ్డు క్రాస్ చేస్తుండగా కడపవైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు. మృతుడి కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

‘పది’ పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కరువు

● నందికొట్కూరులో చర్యలు శూన్యం



బాలికల హైస్కూల్‌లో తిరగని ఫ్యాను



గవర్నమెంట్ హైస్కూల్‌లో కనిపించని ఫ్యాన్లు, బెంచీలు

నందికొట్కూరు: నియోజకవర్గంలోని పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వం పరీక్ష కేంద్రాలకు అన్ని వసతులు కల్పించామని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం శూన్యం. పరీక్ష కేంద్రాల్లో కనీసం మురుగుదొడ్ల, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు సరిగ్గా లేవు. పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలోని పలు గదులకు విద్యుత్ సరఫరానే లేదు. బాలికల హైస్కూల్‌లో ఫ్యాన్లు ఉన్నా పనిచేయడం లేదు. పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్-429, బాలికల ఉన్నత పాఠశాల-198, నవనంది హైస్కూల్-200, విజయవాణి-220, చైతన్య హైస్కూల్-200, జడ్పీ హైస్కూల్ (బాలుర)-100, బ్రహ్మణకొట్కూరు జడ్పీ హైస్కూల్-260 చొప్పున్న మొత్తం-1607 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జూపాడుబంగ్లా: అందరూ కలిసికట్టుగా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి ఆదేశించారు. సోమవారం నుంచి పదో తరగతి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లతో స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ప్రభుత్వ ఉన్నత, మోడల్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 210 మంది, మోడల్‌స్కూల్లో 220 మంది విద్యార్థులు కలిపి మొత్తం 430 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు అందించే ప్రశ్నాపత్రాల కోడ్, ఆన్సర్ షీట్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. పరీక్షాకేంద్రాల్లో ఎలాంటి రిమార్కుల్లేకుండా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సిబ్బంది, టాయ్‌లెట్ సౌకర్యాలతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం చీఫ్ రవికుమార్, డిపార్టుమెంటల్ అధికారి వెంకటేశ్వర్లు, మోడల్‌స్కూల్ పరీక్షా కేంద్రం చీఫ్ వెంకటేశ్వర్లు, డిపార్టుమెంటల్ అధికారి స్వామిశేఖర్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినులకు మెమొంటోలు అందజేస్తున్న డీడీ చింతామణి, వార్డెన్ ఉమాదేవి

జూపాడుబంగ్లా: సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లల్లోని విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి అన్నారు. శనివారం జూపాడుబంగ్లా ఎస్సీబాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆమె పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. అందరూ ఫస్టుక్లాస్‌లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులందరూ కష్టపడి చదవాలని సూచించారు. వార్షిక పరీక్షలు ముగిసే వరకు వార్డెన్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బెస్టు స్టూడెంట్ కీర్తన, రెగ్యులర్ స్టూడెంట్ కె.సుజాత, బెస్టు ఆర్టిస్టు అమృతలకు మెమొంటోలు అందజేసి అభినందించారు. వార్డెన్ ఉమాదేవి పాల్గొన్నారు.

వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలి

పాములపాడు: వైద్యులు హాస్పిటల్‌లో నిత్యం అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎంవీఎస్ రాజు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీకి సంబంధించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ పరిశీలించారు. మందుల కొరత ఉందా అని ఆరా తీశారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని, అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ గులాబ్‌షా ఉన్నారు.

రేనాటి సూర్యచంద్రులు స్ఫూర్తిదాయకం



బుడ్డా వెంగళరెడ్డికి విక్టోరియా మహారాణి బహూకరించిన బంగారు పతకాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్

ఉయ్యాలవాడ : రేనాటి సూర్యచంద్రులైన విప్లవవీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పేదల ఆకలి తీర్చిన కలియుగ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి స్ఫూర్తిదాయకులని ఉమ్మడి కర్నూలు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి సబిహా పర్వీన్ అన్నారు. వీరిద్దరు ఒకే గ్రామంలో జన్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. శనివారం బుడ్డా వెంగళరెడ్డి వారసులైన బుడ్డా విశ్వనాథరెడ్డి గృహానికి ఆమె వెళ్లారు. 1866లో డొక్కల కరువు సంభవించినప్పుడు నాలుగు జిల్లాల ప్రజలకు ఆకలి తీర్చిన తీరును బుడ్డా విశ్వనాథరెడ్డి ఆమెకు వివరించారు. బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వాన్ని మెచ్చి నాడు విక్టోరియా మహారాణి ఆయనను సన్మానించి బంగారు పతకాన్ని అందజేసిందని తెలిపారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, మండల కోఆర్డినేటర్ రమణారెడ్డిలె పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: మండలంలోని రైతులు ప్రభుత్వం ఇచ్చే వ్యవసాయ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అన్ని గ్రామాల రైతుసేవా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ కింద పరికరాలు పొందని సన్న, చిన్నకారు రైతులు ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ముగిసిన కూచిపూడి వర్క్‌షాప్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

నంద్యాల (వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నంది ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్ట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి వర్క్‌షాప్ సెమినార్ శనివారం ముగిసింది. నాట్య గురువులు సురేష్, మౌనిక మాట్లాడుతూ గత వారం రోజులుగా నంద్యాల స్టేట్ బ్యాంక్ కాలనీలో ఈ వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. చివరి రెండు రోజులు చిన్నారులు అహోబిలం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. అహోబిలం ఆలయ నిర్వాహకుడు మురళీశర్మ, జైబాలాజీస్వామి వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు వెల్లడించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెలుగోడు : పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ బ్రహ్మం నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న పరీక్షలకు మండలంలోని 725 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిపోల్ పాఠశాల, మోడల్ పాఠశాల మూడు పరీక్ష కేంద్రాలున్నాయని చెప్పారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే పోలీస్ స్టేషన్‌కు చేరాయని తెలిపారు.

బొప్పాయి చెట్ల నరికివేత

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన యాకోబు ఆలియాస్ ప్రసాద్ కౌలు పొలంలో సాగు చేస్తున్న బొప్పాయి చెట్లను నరికేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సుమారు 42 చెట్లు నరికేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానితుల పేర్లను పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

మిడుతూరు: సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి, ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సంజన్న, సర్పంచ్ జయలక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి ‘పది’ పరీక్షలు

పగిడ్యాల: పాత ముచ్చుమర్రి, పగిడ్యాల జిల్లా పరిషత్ పాఠశాల, లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు మండల విద్యాధికారి సుభాన్ శనివారం తెలిపారు. ఈనెల 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పది పరీక్షలు కొనసాగుతాయన్నారు. మండల వ్యాప్తంగా 460 మంది విద్యార్థులు పరీక్షలకు హజరవుతున్నారని వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవ్వరూ సంచరించకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యత


● కర్ణాటక భక్తులతో మర్యాదగా వ్యవహరించండి
● శ్రీశైలంలోని సత్రాల నిర్వాహకులతో సీఐ సమావేశం



పోలీస్ స్టేషన్ ఆవరణలో సత్రాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్ రావు

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో రానున్న ఉగాది మహోత్సవాలను దృష్టిలో ఉంచుకొని కన్నడిగుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అలాగే క్షేత్ర పవిత్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ప్రసాద్ రావు తెలిపారు. శనివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో క్షేత్రవ్యాప్తంగా ఉన్న సత్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అన్ని సత్రాలు వారు నెల రోజుల బ్యాక్‌అప్‌తో కూడిన సీసీ కెమెరాలు, వాటిని మానిటరింగ్ చేయడం కోసం టెక్నీషియన్లను నియమించుకోవాలని సూచించారు. సత్రాల్లో వివిధ కేటగిరీలో ఉన్న గదుల పట్టికను రిసెప్షన్‌లో ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువ మంది సత్రాల్లో సభలు సమావేశాలు నిర్వహించడం, గొడవలు పడడం వంటివి చేయరాదన్నారు. కర్ణాటక భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తుల పూర్తి వివరాలు ఆధార్ నంబర్‌తో సహా రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే.. పోలీసులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. సత్రాలలో భక్తులకు పెట్టే ఆహారాన్ని ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయించాలన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం



వినియోగదారుల మాసపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ అధ్యక్షతన ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని విద్యార్థులతో కలసి ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తాను కొన్న వస్తువుకు బిల్లు తప్పనిసరిగా పొందాలన్నారు. వినియోగదారునికి బిల్లు శ్రీరామరక్షగా ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి వినియోగదారుల మేలుకొలుపు మాసపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, మల్లికార్జున నాయక్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వేలాలకు స్పందన కరువు



వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: మహానందిలో శనివారం నిర్వహించిన బహిరంగ, షీల్డు టెండర్ల వేలాలకు స్పందన కరువైంది. క్షేత్రంలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు టెండర్లు నిర్వహించారు. నంద్యాల, గాజులపల్లె వైపు టోల్‌గేట్ల నిర్వహణ, భక్తులు పాదరక్షలు భద్రపరుచుకునేందుకు, బీఎస్ఎన్ఎల్ వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ విభాగాలు వాయిదా పడ్డాయి. మూడుసార్లు ఎవరూ పాల్గొనకుండా తక్కువ ధరలకు టెండరు కోట్ చేస్తే దేవస్థానం అధికారులే స్పందించి తక్కువ రేట్లకు ఇస్తారనే ఉద్దేశంతో కావాలనే కొందరు ప్రణాళికలు రూపొందించినట్లు చర్చించుకుంటున్నారు. వీటితో పాటు భూములు, ఎరువు విక్రయాల ద్వారా సుమారు రూ.1.60లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్య అర్చకుడి తీరుపై ఫిర్యాదులు

● వినాయకనందిలో హుండీని మార్చిన ఘనుడు



హుండీని మార్చి పెట్టిన దృశ్యం

మహానంది: క్షేత్రంలోని వినాయకనంది ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ముఖ్య అర్చకుడి తీరుపై పలువురు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆయన చేసిన లీలలు, వ్యవహారాలపై కొందరు పాత్రికేయులు సోషల్ మీడియాలో పెట్టడంతో ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయంలో అనధికార దుకాణం నిర్వహిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా వినాయకనంది ఆలయంలో గతంలో స్వామివారి ముందున్న హుండీని నంది వెనుకకు మార్చేసి తన అనధికార దుకాణం కనిపించకుండా సీసీ కెమెరాలను సైతం తిప్పేయడం గమనార్హం. అన్నీ తెలిసినా ఆలయ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జీఎల్ఎస్ఆర్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలి



మంచినీటి సమస్యను వివరిస్తున్న స్థానికులు

ఆత్మకూరు: పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ కాలనీలో ఉన్న జీఎల్ఎస్ఆర్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టి సురక్షిత నీటిని ప్రజలకు అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రజాచైతన్య యాత్ర మూడో రోజు సందర్భంగా ఆ పార్టీ నాయకులు వెంగళరెడ్డి నగర్‌లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ప్రజలు నీటి సమస్యతో అల్లాడి పోతున్నారన్నారు. ప్రజలకు అధికారులు రోజు మార్చి రోజు నీరు వదులుతున్నారని, ఏదైనా ట్రాన్స్‌ఫారం కాలిపోయినా, బోరు చెడిపోయినా నీటి కష్టాలు అధికమవుతాయన్నారు. అధికారులు స్పందించి ట్యాంకుకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేయాలని కోరారు. డి.రామ్‌నాయక్, వీరన్న, భాస్కర్, షేక్‌ఇస్మాయిల్ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: పాత సున్నిపెంటలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. సబ్‌ట్రెజరీ కార్యాలయం వెనుక భాగంలో నివశిస్తున్న వారిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వీధిలైట్లు పూర్తిగా వెలుగడంలేదని,రాత్రివేళల్లో క్రూరమృగాలు సంచరిస్తుడండంతో భయాందోళనలకు గురవుతున్నట్లు తెలిపారు. వారానికి ఒక రోజు మంచినీరు వస్తుండడంతో సామూహిక కుళాయిల వద్ద వంతుల వారిగా పట్టుకునే నీరు సరిపోవడం లేదని, ఇంటింటికి కుళాయిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. నాయకులు దర్శనం.నాగరాజు,మునిపాటి చిన్న మారెన్న పాల్గొన్నారు.

తర్తూరు జాతరకు ప్రత్యేక కమిటీ నియామకం



తర్తూరు లక్ష్మీరంగనాథస్వామివారి ఆలయం

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న తర్తూరు జాతర నిర్వహణకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మండడి నారాయణరెడ్డి, ఎ.ప్రభావతమ్మ, జి.లక్ష్మీదేవి, కె.వెంకటేశ్వర్లు, పరమేశ్వరయ్య, జె.వెంకటేశ్వరమ్మ, డి.సుబ్బన్నను కమిటీ సభ్యులుగా నియమించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏప్రిల్ 6వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త సభ్యులు ఆదివారం తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి ఆలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఈఓ మార్పిడికి యత్నం?

22రోజుల్లో తర్తూరు జాతర ప్రారంభంకానుండగా తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి ఆలయ ప్రస్తుత ఈఓ వెంకటరమణను బదిలీచేసేందుకు రాజకీయవర్గాలు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో కొత్త ఈఓ నియామకం జరగనున్నట్లు వినికిడి. జాతర నిర్వహణకు అతికొద్దిరోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఈఓను బదిలీచేసి కొత్త ఈఓను నియమిస్తే వారికి జాతర నిర్వహణపై అవగాహన లేకపోవటం వల్ల స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత ఈఓను బదిలీచేస్తే బాగుంటుందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

కొత్తపల్లి: ఎదురురెదురుగా వస్తున్న టాటా ఏస్, బైక్ ఢీ కొనడంతో ఇద్దరికి రక్తగాయాలైన ఘటన శనివారం మండలంలోని పాతమాడుగుల, కపిలేశ్వరం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన జొల్లు బాల లక్ష్మయ్య, భార్య సరస్వతితో కలసి ద్విచక్రవాహనంపై సంగమేశ్వరం వైపు నుంచి వస్తున్నారు. అదే సమంలో ఎర్రమఠం వైపు నుంచి ఓ టాటా ఏస్(మ్యాక్స్) సంగమేశ్వరం వైపు వస్తుంది. దనుశ్యాల లింగమయ్య ప్రాంతం సమీపంలో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో సరస్వతికి స్వల్ప గాయాలు కాగా బాల లక్ష్మయ్యకు తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 వాహనంలో క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం బాల లక్ష్మయ్య పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రదానికి గల కారణాలను సేకరిస్తున్నారు. టాటా ఏసీ(మ్యాక్స్) వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



వెలుగోడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెలుగోడు: వెలుగోడు,బోయరేవులలో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ..సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస గౌడ్,ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఏవో పవన్ కుమార్,ఈవోఆర్‌డి మురారి,సర్పంచ్‌లు వేల్పుల జైపాల్, పెద్ద స్వామన్న, గ్రామ కార్యదర్శులు సుంకన్న,నాగరాజు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం ద్వారా స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణం చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతో పాటు చుట్టుపక్కల పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.మహేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె.రాజన్న పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ పద్మావతి, స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ కోరారు. శనివారం తాగునీరు, పారిశుద్ధ్యం, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ గ్రీన్ లీఫ్ రేటింగ్ తదితర అంశాలపై అన్ని గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ రామకృష్ణవేణి,పంచాయతీ కార్యదర్శి అక్బర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర దివాస్ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని 11వ వార్డులోని కూరగాయల మార్కెట్‌లో నిర్వహించారు. కౌన్సిలర్ షఫీవుల్లా పాల్గొన్నారు.

పగిడ్యాల: స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

జూపాడుబంగ్లా: తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ నాగన్న, రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీడీఓ గోపికృష్ణ గ్రామంలోని కిరాణం దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్ల వినియోగించరాదని, ఇకపై వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులిచ్చారు. అలాగే ఇళ్లవద్దకు వెళ్లి తడి, పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు.

పాములపాడు: మండల ప్రత్యేకాధికారి ఎంవీఎస్ రాజు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగించరాదని హోటళ్లు, దుకాణాల యజమానులకు నోటీలు అందజేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది స్టేషన్ ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచు మేకల బాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో ప్రత్యేకాధికారి చింతమాణి, ఎంపీడీఓ మేరి, సర్పంచు శోభలతలు, కొక్కెరంచలో పశువైద్యాధికారి అశోక్ కుమార్, కొత్తపల్లిలో తహసీల్దార్ ఉమారాణి, సర్పంచు లక్ష్మీదేవి, శివపురంలో ఏపీఎం పుల్లయ్య, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు.